క్లుప్తంగా

ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



నరసరావుపేట: రంజాన్ సందర్భంగా సోమవారం సాయంత్రం 31వ వార్డు మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి బరంపేట బైపాస్‌రోడ్డులో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇఫ్తార్ ప్రారంభించి, వడ్డించారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషా భేగం ఖాజావలి, పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథార్టీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, పట్టణ కన్వీనర్ ఎస్‌ఏ హనీఫ్, న్యాయవాది కట్టా నారపరెడ్డి, మాజీ కౌన్సిలర్ షేక్ రెహమాన్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉగాది పండగ



చిలకలూరిపేట: తెలుగు సంవత్సరాది ఉగాది పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. ఇళ్ల గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి, నూతన వస్త్రాలు ధరించి తమ ఇష్టదైవాలను కొలిచేందుకు ఆలయాలకు బారులు తీరారు. దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేద మంత్రాలు, పంచాగ శ్రవణాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయాల్లో అభిషేకాలు క్రోధి నామ సంవత్సర ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. అన్నదానాలు చేశారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

పేద పిల్లలకు దుస్తులు పంపిణీ



చిలకలూరిపేట: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రంజాన్ పండగను పురస్కరించుకొని 60మంది నిరు పేద ముస్లింపిల్లలకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఒక పేద విద్యార్థినికి రూ.5వేలు ఉపకార వేతనం, వాసు అనే వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేలు అందించారు. కార్యక్రమాన్ని ఒయాసిస్ సంస్థ సభ్యురాలు షేక్ బీబీజాన్ అందించిన రూ. 40వేలు ఆర్థిక సాయంతో నిర్వహించినట్లు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయ, సభ్యులు సంధ్య, శైలజ, సుబ్బాయమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: కనపర్రు శివారు మైనంపాడు గ్రామంలో కొలువైయున్న గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయాన్ని శుద్ధి చేసి, అలంకరించారు. అమ్మవారికి జలాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. అష్టోత్తర నామ పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో గేదెలు మృతి



రొంపిచర్ల : మండలం కేంద్రంలోని కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ వేపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు గేదెలు మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.లక్ష కు పైగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఒంగోలు నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కారు ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. మృతి చెందిన గేదెలు ఎవరివీ అనేది తెలియాల్సి ఉంది.

వైభవంగా ఉగాది వేడుకలు

నాదెండ్ల: క్రోధి నామ సంవత్సరం ఉగాది వేడుకలు అన్ని గ్రామాల్లో, ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల డొంక రోడ్డులో కొలువైయున్న చారిత్రాత్మక నందికుంట విఘ్నేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది వేడుకలు జరిపారు. ఆలయ పూజారి ఇర్లపాటి వాసు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, గోత్ర నామ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉగాది పచ్చడితో పాటూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో పంచాంగాలు అందించారు. చిరుమామిళ్ళ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. పూజారి భరత్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గాదె సుజాత, ఆలయ ధర్మకర్త కొల్లిపర సాంబశివరావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పంచాంగ శ్రవణం చేశారు. గణపవరంలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

క్రోధి నామ సంవత్సరానికి ఆహ్వానం

యడ్లపాడు: మండలంలోని ప్రజలు క్రోధి నామ తెలుగు సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాల కొనుగోలు, మామిడి తోరణాలు, పండ్లు, పూలు కొనుగోలు చేశారు. పండుగ సందర్భంగా పూల ధరలు పెరిగాయి. ఉదయం గ్రామాల్లోని రైతులు ఎడ్లను అలంకరించి, ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. పలుచోట్ల వేద పండితులు, పురోహితులు కొత్త ఏడాదిని పురస్కరించుకుని పంచాంగ శ్రవణం చేశారు. యడ్లపాడు రణ వీరాంజనేయస్వామి బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామంలోని భూనీలా రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో పుసులూరి రంగాచార్యులు పాల్గొని పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖరశర్మ, వంకాయలపాటి ఆనంద్‌కుమార్, మైదవోలు శేషయ్య, కాకుమాను మాధవ వెంకట హనుమాన్, గిరి, శ్రీను పర్యవేక్షించారు.



పంచాంగాలు పంపిణీ చేస్తున్న ఈవో తులసీదాస్



పంచాంగ శ్రవణం చేస్తున్న వీఎస్ఎస్ అయ్యంగార్

ఘనంగా ఉగాది వేడుకలు

రొంపిచర్ల: మండల ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ వ్యవసాయ పనిముట్లకు పూజలు నిర్వహించి పొలాల్లో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. దేవాలయాలు భక్తులతో కళకళలాడాయి. పంచాగ శ్రవణ కార్యక్రమాలు జరిగాయి. పెద్దలకు పూజలు చేసి, నూతన వస్త్రాలను పెట్టుకున్నారు. అనంతరం ముత్తైదువులను పేరంటానికి పిలిచి తాంబూళాలను అందజేశారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.



గణపవరం వీరాంజనేయస్వామి ఆలయంలో ఉగాది విశిష్టతను వివరిస్తున్న పూజారి

ఘనంగా ఉగాది వేడుకలు

నరసరావుపేట ఈస్ట్: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు. ఆయా ఆలయాల్లో పండితులు క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. పాండురంగస్వామి ఆలయంలో వీఎస్ఎస్ అయ్యంగార్, శృంగేరి శంకరమఠంలో రిటైర్డ్ ఆంధ్రోపన్యాసకులు ప్రసాదరావు పంచాంగ శ్రవణం నిర్వహించారు. వివిధ సంస్థల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద శ్రీవాసవి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, పంచాంగాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఊరా భాస్కరరావు, మండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, వెల్లంపల్లి కేశవరావు తదితరులు పాల్గొన్నారు. బరంపేటలోని శ్రీ రాధా గోవింద చంద్రమందిరం ఇస్కాన్ ఆలయంలో ఉగాది పర్వదినంతో పాటు ఆలయ 12వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మూల విరాట్‌లకు 1008 రకాల మధుర భక్ష్యాలతో మహారాజ భోగ నివేదనం సమర్పించారు. అలాగే మహా శంఖాభిషేకం నిర్వహించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



విప్పర్ల గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి



ఉగాది పచ్చడి, పంచాంగాలను పంపిణీ చేస్తున్న వాసవి మిత్రమండలి ప్రతినిధులు



రాధా గోవిందులకు ప్రత్యేక అలంకరణ

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

చిలకలూరిపేట: సమాజ శ్రేయస్సుకు, ఉన్నత ఆశయ సాధనకు జీవితం అంకితం చేసిన కమ్యూనిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ అన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టిన చంద్ర రాజేశ్వరరావు బెనారస్ హిందూ యూనివర్శిటీలో కమ్యూనిస్టు సెల్ ఏర్పాటుకు నాంది పలికారని చెప్పారు. అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు నడిపినందుకు ఆయనకు సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డుతో సత్కరించిందని చెప్పారు. సుదీర్ఘ కాలం కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పేలూరి రామారావు, మహిళా సమాఖ్య కార్యదర్శి బి.లలితకుమారి, బొంతా భగత్ సింగ్, మేకపోతుల నాగేశ్వరరావు, తోట నరసింహ పాల్గొన్నారు.



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ దేవాలయ వార్షికోత్సవం

నాదెండ్ల: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు సాతులూరు గ్రామంలోని రెడ్డి పేరంటాలమ్మ ఆలయంలో వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కుబడులు చెల్లించుకున్నారు. మొక్కుబడుల ప్రభలు కట్టి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పలువురు దాతలు ప్రసాదాలు పంపిణీ చేశారు. బారికేడ్లతో క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం పల్లంగా ఉండటం, శిథిలావస్థకు చేరటంతో ఇటీవల ఆలయ కమిటీ సభ్యులు జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. బాలాలయం ఏర్పాటు చేసి విగ్రహాలను తరలించారు.



ప్రత్యేక అలంకరణలో రెడ్డి పేరంటాలమ్మ తల్లి

ఘనంగా శంకరేశ్వరస్వామి తిరునాళ్ల

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో బాల త్రిపుర సుందరి సమేత శంకరేశ్వరస్వామి తిరునాళ్లను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి, నైవేద్యాలు సమర్పించారు. వేలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తిరునాళ్లలో శాంతిభద్రతలను రొంపిచర్ల పోలీసులు పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో శంకరేశ్వర స్వామి



దేవాలయ ఆవరణలో ప్రసాదాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల రైల్వేస్టేషన్‌లో దొంగల హల్‌చల్

రొంపిచర్ల: స్థానిక రైల్వే స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు కాపర్ వైర్‌ను దొంగిలించారు. సుమారు పది మంది దొంగలు స్టేషన్‌లో ఉన్న వారిపై రాళ్లు విసిరారు. దీంతో అక్కడున్న వారు రొంపిచర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగతనానికి వచ్చి కాపర్ వైర్ దొంగిలస్తున్న వారిని వీడియో తీశారు. వీడియో ఆధారంగా ఈ దొంగతనంలో పది మంది పాల్గొన్నట్లు తెలుస్తోంది. వీడియో ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



రైల్వే స్టేషన్‌లో దొంగిలించగా మిగిలిన కాపర్ వైరు

ఉపాధి పనులు ప్రారంభం

రాజుపాలెం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఉగాది పండుగ పురస్కరించుకుని 2024–25 ఏడాదికి ఉపాధి పనులు మంగళవారం ప్రారంభించారు. బ్రాహ్మణపల్లిలో ఏపీవో సీహెచ్ వెంకటేశ్వర్లు ఉపాధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ సగటు వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెంచడం జరిగిందన్నారు. టెక్నికల్ అసిస్టెంట్ అల్లాభక్షి, ఏ నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, మేట్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలకండి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు జిల్లా వాసులు, బీసీ సామాజిక సంఘీయులు ఘనంగా స్వాగతం పలకాలని ఏపీ బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ పిలుపు ఇచ్చారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఐదేళ్ల పరిపాలనలో బీసీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం న్యాయం చేసిందన్నారు. మరోసారి రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

నరసరావుపేట: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశాలతో మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. నరసరావుపేట పట్టణంలోని ప్రశాంతినగర్, నవోదయ నగర్, రామిరెడ్డిపేట, యడ్లపాడు మండలంలోని మైదవోలు, అమరావతి మండలంలోని అత్తలూరు, జూపూడి, నూతలపాటివారి పాలెం గ్రామాలు, మాచర్ల పట్టణంలోని రైల్వేగేటు, నాగార్జున సాగర్ రోడ్డు, రింగ్‌రోడ్డు, యాదవ బజారుల్లో పోలీస్ అధికారులు సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది, కేంద్ర సాయుద బలగాలు కలిసి కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలలో భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లు జరగకుండా, ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా, శాంతి భద్రతలను కాపాడేందుకు కవాతు నిర్వహించారన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజలకు జిల్లా ఎస్పీ కోరారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా దానికి జిల్లా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

చలివేంద్రం ప్రారంభం

సత్తెనపల్లి: వేసవి కాలంలో తాగునీటిని అందించటం అభినందనీయమని పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్లో గల వినాయకుని గుడివద్ద త్రిపురమల్లు శేషగిరిరావు ధర్మపత్ని రామతులశమ్మ చారిటిబుల్ ట్రస్ట్ తరపున వారి కుమారులు మల్లేశ్వరరావు, అంబరీష్ ఆర్థిక సహకారంతో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం నిర్వహిస్తున్న మంచి నీటి చలివేంద్రం మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘ పట్టణ అధ్యక్షుడు చిల్లంచర్ల కళ్యాణ్, ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూధనరావు, గోశాల అధ్యక్షుడు మాడా నాగ రమేష్, చలివేంద్ర సంఘ సభ్యులు కనమర్లపూడి సుబ్బారావు, కొత్తూరి విశ్వేశ్వరరావు, చిలకల శ్రీనివాసరావు, నోముల వెంకటరమణ, దేవరపల్లి మల్లేశ్వరరావు, దేవరశెట్టి రవికుమార్, తొమ్మండ్రు సత్యనారాయణ, కాపుగంటి సాయిసుమంత్, జవ్వాజి రవి, కొత్త లక్ష్మయ్య, దేవతి సుబ్బారావు, డి.శ్రీనివాసరావు, వాసవి క్లబ్ సభ్యులు కొప్పురావూరి కాశీ, పాల్గొన్నారు.



పేద ముస్లింలకు రంజాన్ తోఫా

పెదకూరపాడు(అమరావతి): స్థానిక కిరోసిన్ షేక్ మీరస గారి కుమారుడు షేక్ అహ్మద్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ పండుగ పురస్కరించుకుని 50 ముస్లిం పేద కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. నిత్యావసర సరుకులతో కూడిన రంజాన్ తోఫా జకాత్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ అహ్మద్, మాజీ అంజుమాన్ ప్రెసిడెంట్ షేక్ మహమ్మద్ షరీఫ్, నాయబ్ ముస్తఫా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగి ఉన్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.85 వేల విలువైన తెలంగాణ మద్యం 112 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ నయనతార తెలిపారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆమె వెల్లడించారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు గడియార స్తంభం వద్ద రజక వాడలో దాడులు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా మద్యం కలిగి ఉన్న అట్లూరి వెంకటరెడ్డిని అరెస్ట్ చేసి, అతని నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచామన్నారు.



మద్యం బాటిళ్లు, నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న సీఐ నయనతార